ప్రతిపక్షాలది ఓర్వలేనితనం

- జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి గిట్టకే విమర్శలు
- వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి
- ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజల మద్దతు మాకే
- గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: అన్నీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, చంద్రబాబు నాయుడు లేనిపోని విమర్శలు చేస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి 22వ డివిజన్‌లో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, స్థానిక కార్పొరేటర్ పైడి సునీతతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు వచ్చే ఎన్నికల్లో మద్దతుగా ఉంటారా తల్లీ? అని స్థానిక మహిళలను అడిగారు. ‘అదేమిటన్నా అలా అడిగారు. ఇన్ని సంక్షేమ పథకాలు అందించి మా జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు జగనన్న. అలాంటి దేవుడికి మేము మద్దతుగా ఉండడమే కాదు. తిరిగి గెలిపించుకోవడం మా బాధ్యత’ అంటూ మహిళలు ఎమ్మెల్యేకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ సంక్షేమ పథకాలతో ప్రజల మనసులను గెలుచుకున్నారని తెలిపారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్నీ వర్గాలు సుభిక్షంగా ఉంటాయని చెప్పారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు విమర్శలు

ప్రజల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని.. 14 ఏళ్ల సీఎంగా ఉన్నా తనకు ఇలాంటి ఆదరణ లభించలేదనే అక్కసులో ప్రభుత్వంపై బాబు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ వల్ల తమకు ఉనికి ప్రమాదంలో పడిందనే భయంతో ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు తలకిందుల తపస్సు చేసినా వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఓడించలేరని స్పష్టం చేశారు.

సీఎం సహకారంతోనే తిరుపతి అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారంతోనే తిరుపతిని ఇంతలా అభివృద్ధి చేయగలిగామని ఎమ్మెల్యే భూమన తెలిపారు. తిరుపతిలో ఎన్నడూ లేని విధంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు, సీసీరోడ్లు, ఫ్లెఓవర్, లింకురోడ్లు వంటి అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని తెలిపారు. తిరుపతి నగర శివారు ప్రాంతాల్లో సైతం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతి నగర ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులతో ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆరణి సంధ్య, మునిరామిరెడ్డి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాథమునిరెడ్డి, వేమూరి జ్యోతిప్రకాష్, మాకం చంద్రయ్య, మారేళ్ల బ్రహ్మానందరెడ్డి, పార్టీ నాయకులు డిష్ చంద్ర, వెంకటమునిరెడ్డి, పడమటి కుమార్, తిమ్మారెడ్డి, అనీల్, కిరణ్, మనోహర్‌రెడ్డి, పాముల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాలను ఉపేక్షించొద్దు


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో అనధికారిక నిర్మాణాలను ఆదిలోనే గుర్తించి చర్యలు తీసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి. హరిత అధికారులకు సూచించారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాక అనుమతులు లేవనో, నిబంధనలు అతిక్రమించారనో చర్యలు తీసుకోవడం అందరికీ ఇబ్బందికరంగానే ఉంటుందని చెప్పారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టౌన్ ప్లానింగ్‌కి సుమారు 100 మందికిపైగా అదనపు సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో భవన నిర్మాణాలపై పర్యవేక్షణ పెంచాలన్నారు. భవన నిర్మాణం ప్రారంభించే సమయంలోనే ప్లాన్ ఉందా? నిబంధనల ప్రకారం పనులు చేపడుతున్నారా? అన్న వాటిపై పూర్తిగా ఆరా తీయాలని సూచించారు. అనుమతులు లేకున్నా ప్లాన్‌కు విరుద్ధంగా భవనాన్ని నిర్మిస్తున్నా వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్లానింగ్ సెక్రటరీలదే అన్నారు. నగరంలో అనుమతులు లేని భవన నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు త్వరగా అందజేయాలన్నారు. అదే విధంగా నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ట్రేడ్ లైసెన్సులను రెన్యువల్ చేయించడం, కొత్త దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అడ్వర్‌టైజింగ్ బాకాయిలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాల సుబ్రహ్మణ్యం, టీపీఓలు, ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యర్థాలతో సంపద అంశంపై సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్: వ్యర్థాలతో సంపద అనే అంశంపై మంగళవారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో అప్‌లైడ్ మైక్రోబయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, ఎస్వీయూ సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. మైక్రోబయాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ వీవీ లక్ష్మి వ్యర్థాల నుంచి సంపదను ఎలా సృష్టించాలో వివరించారు. పరిశోధన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు విద్యాపరమైన పరివర్తనను తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి క్లస్టర్ కోఆర్డినేటర్ డీఎం మమత, ప్రొఫెసర్లు దామోదరం, చండీకుమారి, జయమాధురి పాల్గొన్నారు.

రుతుచక్ర పరిశుభ్రతపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దొడ్డాపురం నగరపాలక హైస్కూల్‌లో రుతుచక్ర పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 28న అంతర్జాతీయ రుతుచక్ర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అధ్యయన కేంద్ర డాక్టర్ కె.రాణి మాట్లాడారు. రుతుచక్ర పరిశుభ్రతపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండడం తప్పనిసరి అన్నారు. రుతుచక్ర పరిశుభ్రత పాటించకుంటే చిన్న ఇన్‌ఫెక్షన్‌తో మొదలై ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుందన్నారు. రుతుచక్ర క్రమంలో పాటించాల్సిన ఆహార, ఆరోగ్య, పరిశుభ్రత నియమ నిబంధనలు, మూఢ విశ్వాసాలను వివరించారు. నెలసరి సమయంలో శారీరక, మానసికంగా సంసిద్ధంగా ఉండడం ద్వారా ఆత్మ స్థైర్యం, ఆత్మ విశ్వాసం కలిగి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యయన కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

వెస్ట్ సీఐకి కార్పొరేటర్ల సత్కారం


జయనాయక్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్లు

తిరుపతి మంగళం: తిరుపతి వెస్ట్ సీఐగా బాధ్యతలు తీసుకున్న జయనాయక్‌ను తిరుపతి నగరంలోని 24, 28వ డివిజన్ల కార్పొరేటర్లు హనుమంత్‌నాయక్, పొన్నాల చంద్ర మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుస్సాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు ఐసీఎస్ రెడ్డి, నారాయణరెడ్డి, ద్వారక, శంకర్, సునీల్‌యాదవ్ ఉన్నారు.

వైద్య శిబిరాలపై గ్రామాల్లో అవగాహన

చంద్రగిరి(తిరుపతి రూరల్): నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలపై గ్రామాల్లో ప్రజాప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం మిట్టపాలెం, నరసింగాపురం, బుచ్చినాయుడుపల్లి, పిచ్చినాయుడుపల్లి, తొండవాడ, శానంబట్ల, రాయలపురం, దోర్నకంబాల గ్రామాల్లో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు అశ్వినిప్రవీణ్ కుమార్, సర్పంచ్‌లు ప్రవీణ్ కుమార్, చెంచురత్నం, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి వైద్య శిబిరంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెళ్లి కానుక అందజేత


పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో పెళ్లి చేసుకోనున్న తమలి, జెన్నీ జంటకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను అందజేశారు. ఇందులో బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, గాజులు, బాజికాలు, పట్టుబట్టలు, తిరుమల శ్రీవారి ప్రసాదాలు ఉన్నాయి. దీనిపై ఇరు కుటుంబాలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపాయి. వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ గౌరీశంకర్‌రాజు, నాగూర్‌బాషా, మునిరత్నంరెడ్డి, వనజ, వెంకటేష్, సంపత్, బాబురెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ఆటో



వెంకటగిరిరూరల్: ముందుగా వెళుతున్న మోటారు సైకిల్‌ను వెనుకవైపు వస్తున్న ఆటో అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటన పట్టణంలోని గురుకుల పాఠశాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. డక్కిలి మండలానికి చెందిన గురువయ్య తమ కుమార్తెను మోటారు సైకిల్‌లో తీసుకెళ్లి, గురుకుల పాఠశాలలో వదిలి తిరిగి క్రాస్‌రోడ్డు వైపు వస్తున్నారు. వెనుక వస్తున్న పట్టణానికి చెందిన బాషా ఆటో అదుపుతప్పి ఢీకొంది. దీంతో మోటారు సైకిల్, ఆటో సమీపంలోని డ్రైనేజీ కాలువలో పడిపోయాయి. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని బయటకు తీశారు.

పంచగవ్య ఉత్పత్తులపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ జేఈవో సదా భార్గవి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న పంచగవ్య ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె పంచగవ్య ఉత్పత్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచగవ్య ఉత్పత్తులపై ఎస్వీబీసీ, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కల్పించాలని సూచించారు. పంచగవ్య ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు, నాణ్యత ప్రమాణాలు, భక్తులకు అవి అందుతున్న విధానంపై ఆమె ఆశీర్వాద కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. వివిధ ప్రముఖ ఆలయాల వద్ద విక్రయాల వివరాలను తెలుసుకున్నారు. తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో విక్రయాల కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దోమల నివారణకు ఒకటి, చేతులు శుభ్రం చేసుకునేందుకు మరొక లిక్విడ్‌ను 20 రోజుల్లో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విక్రయాల కోసం ప్రత్యేకంగా అప్లికేషన్ తయారు చేయాలని ఐటీజీఎంను ఆదేశించారు. నమామి గోవింద ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేషశైలేంద్ర, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, పీఆర్వో డాక్టర్ రవి,గోశాల డైరెక్టర్ డాక్టర్ హరినాథరెడ్డి, డెప్యూటీ ఈవో గుణభూషణరెడ్డి, ఐటీ జీఎం సందీప్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

పాకాల: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని జిల్లా సమగ్ర శిక్షా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త శ్రీధర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓలు బాబ్జీ, లింగయ్య అధ్యక్షతన గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, విద్యా సహాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాలు నిండిన చిన్నారులు పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసిన వారిని సమీప ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేరేలా చూడాలన్నారు. మరో సెక్టోరియల్ ఏఎస్ఓ రుక్మంగద మాట్లాడుతూ.. నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక అందరికి అందాలని పేర్కొన్నారు. ఎంఈఓలు మాట్లాడుతూ.. జీవీకే ఇచ్చిన వెంటనే విద్యార్థుల తల్లుల వద్ద బయోమెట్రిక్ తీసుకోవాలని తెలిపారు. ప్రతీ విద్యార్థికి కానుక అందేలా చూడాలని సూచించారు. నాడు-నేడు పాఠశాలల బిల్లుల అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్స్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు గోపాల్, ధనంజయ, సీఆర్పీలు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మెకానిక్‌లు

తిరుపతి కల్చరల్: రోడ్డు ప్రమాదంలో కుడిచేయి పోగొట్టుకున్న మాధవనగర్‌కు చెందిన మెకానిక్ భార్గవ్‌కు తిరుపతి జిల్లా టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. తోటి మెకానిక్‌ను ఆదుకోవాలనే సేవా దృక్పథంలో తిరుపతిలోని మెకానిక్‌లు తమ వంతు సాయంగా రూ.10వేలు పోగు చేసి సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చంద్రగిరి ఇన్‌చార్జ్ జలంధర్, హరి, మురుగ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాకు సహకరించండి

తిరుపతి తుడా: తిరుపతి నియోజవర్గంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు, చేరికలపై సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తిరుపతి నియోజకవర్గ ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత కోరారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం గుర్తింపు కల్గిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ప్రతి సంవత్సరం జూలైలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులకు అవకాశం కల్పిస్తూ స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందని, ఇందులో భాగంగా తిరుపతి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పుల కోసం జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారన్నారు. తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, డీటీ జీవన్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సదాశివపురంలో చైన్ స్నాచింగ్

ఏర్పేడు: సిని ఫక్కీలో ఓ మహిళ మెడలోని బంగారు చైన్, తాళిబొట్టును లాక్కుపోయిన సంఘటన మంగళవారం మండలంలోని సదాశివపురంలో చోటుచేసుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన సులోచనమ్మ చిల్లర దుకాణం నిర్వహిస్తోంది. ఉదయం 5 గంటలకు నిద్రలేచి వాకిలి చిమ్ముతుండగా ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దుకాణం వద్దకు వచ్చారు. పెట్రోలు కావాలని ఆమెను అడిగారు. ఆమె పెట్రోలు ఇచ్చింది. మళ్లీ తమకు కూల్‌డ్రింక్ కావాలని అడగడంతో సులోచనమ్మ భర్త దుకాణంలోకి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన ఆ యువకులు సులోచనమ్మ మెడలోని 4 సవరాల బంగారు చైన్, తాళిబొట్టును లాక్కొని శ్రీకాళహస్తి వైపు పరారయ్యారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితురాలి తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కాపు సంక్షేమ యువసేన అధ్యక్షుడి నియామకం


మాట్లాడుతున్న ఆనంద్‌రావు

తిరుపతి కల్చరల్: కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా పోటుగూరి ఆనంద్‌రావు నియమితులయ్యారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కాపు, బలిజ, ఒంటరి కులాల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి కల్పించిన కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు హరిరామజోగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కాపు సంక్షేమ యువసేన జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, హేమంత్, పురుషోత్తం, వెంకటరాయల్, పార్థసారథి, రాజమహల్ రాయల్ పాల్గొన్నారు.

ఎంపీ గురుమూర్తికి వినతి

తిరుపతి కల్చరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో శాంతి నెలకొల్పే దిశగా పార్లమెంట్‌లో చర్చించాలని బిషప్ కౌన్సిల్ ప్రతినిధులు ఎంపీ గురుమూర్తిని కోరారు. ఎంపీ విదేశాలకు పయనమవుతున్న క్రమంలో ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, కోశాధికారి విక్టర్ పాల్, జాయింట్ కార్యదర్శి మోజేస్, నవీన్‌కుమార్, పరవశివం, చిరంజీవి పాల్గొన్నారు.

బడుగు బలహీనవర్గాలకు అండగా ఉండండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘం నేతలు

తిరుపతి అర్బన్: బడుగు బలహీనవర్గాల వారికి అండగా ఉండాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం కాలయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ కోరారు. మంగళవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. తప్పకుండా అండగా ఉండామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. నేతలు నాగభూషణం, బలరామ్, శివ, రాజా, వరలక్ష్మి, రూప ఉన్నారు.

కులాల మధ్య చిచ్చుపెట్టే సంస్కృతి చంద్రబాబుది

- ఆయన్ను నమ్మే స్థితిలో ఎస్సీ, ఎస్టీలు లేరు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు


మీడియాతో మాట్లాడుతున్న నల్లాని బాబు

తిరుపతి మంగళం: తన రాజకీయ లబ్ధి కోసం కులాల మధ్య చిచ్చుపెట్టే నీచ సంస్కృతి చంద్రబాబుదని మరోసారి రుజువైందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళగిరిలో చంద్రబాబు నిర్వహించిన ఎస్సీల సమావేశంలో కేవలం మాలలను మాత్రమే ఆహ్వానించి విభజించు పాలించు అన్న తత్వాన్ని మరోసారి నిరూపించుకున్నారని మండిపడ్డారు. ఎస్సీల సమావేశం అంటే మాల, మాదిగలతో కలిపి సమావేశం నిర్వహించాలని, అలా కాకుండా ఎస్సీల సమావేశం పేరుతో మాలలను, మాదిగలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా? అన్న విషయాన్ని ఎస్సీ, ఎస్టీలు మరిచిపోరన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఏ నాడు దళితుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయన్న దురాలోచనతో ఎస్సీలకు ఏదో మేలు చేసేలా కళ్లబొల్లి మాటలు చెబితే వినే స్థితిలో ఎస్సీలు లేరన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాకే దళితులకు సమాజంలో గౌరవం దక్కిందని, ఉన్నత పదవులను అధిరోహించగలిగామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్నకే దళితులంతా మద్దతుగా ఉంటారే తప్ప దళిత ద్రోహి చంద్రబాబుకు కాదని స్పష్టం చేశారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అమానుషం

ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్


మాట్లాడుతున్న ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ప్రవీణ్

తిరుపతి కల్చరల్: మణిపూర్ రాష్ట్రంలో రెండు వర్గాల మధ్య జరిగిన చిన్న గొడవ కారణంగా క్రైస్తవులపై దాడులు చేయడం, చర్చిలు ధ్వంసం చేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో చర్చిలను తగలబెట్టడం, చర్చిలను పడగొట్టడం వంటి దుశ్చర్యలు చోటు చేసుకోవడం దారుణమని అన్నారు. తక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విధ్వంసం, దాడులతో వంద మంది చనిపోయేంత వరకు వేడుక చూడడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం స్పందించి శాంతిని నెలకొల్పాలని కోరారు. సమావేశంలో ఏపీ బిషప్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి వానాల డేవిడ్ రాజు, క్రైస్తవ నాయకులు ఎస్‌పీ. దేవదానం, సీహెచ్ మోజెస్, విక్టర్ పాల్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రికి వైద్య పరికరాల వితరణ


కాల్ రేడియో ప్రతినిధులతో ఈఎస్‌ఐ వైద్యులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఫిజియోథెరపీ విభాగానికి మంగళవారం వైద్య పరికరాలను వితరణ చేశారు. కాల్ రేడియా ప్రతినిధులు శ్రీధర్, యోగేశ్వర్ సుమారు రూ.2 లక్షల విలువైన లేజర్ థెరపీ, అనాల్జిసిక్ పల్సర్, పీఈఎంఎఫ్, ఐఎఫ్‌టీ వంటి పరికరాలను అందజేశారు. ఈ పరికరాలతో మరింత మంది రోగులకు మెరుగైన చికిత్స చేసేందుకు దోహదపడుతుందని ఈఎస్ఐ ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ శ్రీధర్, ఆర్ఎం డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. వైద్యులు సునీత, ఫిజియోథెరపిస్ట్ వినోద్, ఎస్ఎస్ అమ్ములు పాల్గొన్నారు.

గూడూరు మున్సిపల్ కమిషనర్ బదిలీ

గూడూరు: మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న తోట సాయినాథ్‌ను కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో వేకెన్సీలో ఉన్న ఎం వెంకటేశ్వర్లును నియమిస్తూ ఈ నెల 26వ తేదీన కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేట్ నుంచి ఉత్తర్వులు అందాయి.

ఈద్గాలో బక్రీద్‌కు మెరుగైన సౌకర్యాలు

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భూమన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: బక్రీద్ నేపథ్యంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేపట్టే ఈద్గా మైదానంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈద్గాలో జరుగుతున్న పనులను మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలతో కలిసి మంగళవారం పరిశీలించారు. మైదానంలో క్రికెట్ ఆడుతున్న ముస్లిం పిల్లలతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. పిల్లలకు చాకెట్లు పంచిపెట్టి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిరుపతిలో ముస్లింలు హిందువులతో అత్యంత ఆత్మీయ అనుబంధాలను ఏర్పరుచుకుని అందరూ ఒక్కటే అనే భావనతో సాగుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఏ పండుగ అయినా కలిసి చేసుకుంటూ ఐక్యత చాటుతున్నారని తెలిపారు. బక్రీద్ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రార్థనలు చేయడానికి జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గతం కన్నా భిన్నంగా పరిశుభ్రమైన వాతావరణంలో సకల సౌకర్యాలతో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో చలువ పందిళ్లు, తాగునీరు, గ్రీన్ మ్యాట్లు, కూలర్స్ వంటివి ఏర్పాటు చేసి అత్యంత భక్తిభావంతో ప్రార్థనలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు ముందస్తుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, కోటూరు ఆంజనేయులు, ఎస్‌కే బాబు, ఎస్‌కే.ఇమామ్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ రఫీ, ఇమ్రాన్, మాలిక్, ఇస్మాయిల్, చాంద్‌బాషా, నగర పాలక సంస్థ డీఈ రవీంద్ర, కిషన్ ఉన్నారు.